ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

బుధవారం 17 జూలై 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక


ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

A.C.O - 9003200801
S.R - 9551168092

27/11, సౌందరరాజన్ స్ట్రీట్, టి.నగర్, చెన్నై-600017

సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ మహాదేవన్

హైకోర్టు తాత్కాలిక సీజేగా జస్టిస్ కృష్ణకుమార్



జస్టిస్ మహాదేవన్



జస్టిస్ డి.కృష్ణకుమార్

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.మహాదేవన్‌కు పదోన్నతి లభించింది. ఆయన్ని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం జస్టిస్ మహాదేవన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా సిఫారసు చేసిన విషయం తెలిసిందే. దానిని పరిశీలించిన కేంద్రప్రభుత్వం రాష్ట్రపతికి పంపించగా, అక్కడ ఆమోదం లభించింది. ఆ మేరకు కేంద్ర న్యాయశాఖ సంయుక్త కార్యదర్శి జగన్నాథ్ శ్రీనివాసన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మహాదేవన్ సుప్రీంకోర్టుకు వెళ్లడంతో హైకోర్టు న్యాయమూర్తుల్లో సీనియర్ అయిన జస్టిస్ డి.కృష్ణకుమార్‌ను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా కేంద్రం నియమించింది. హైకోర్టుకు పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా బాంబే హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ కేఆర్ శ్రీరాంను నియమిస్తూ ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన విషయం తెలిసిందే. అయితే ఆ సిఫారసుకు రాష్ట్రపతి ఆమోదం తెలపాల్సివుంది. అప్పటి వరకూ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ కృష్ణకుమార్ వ్యవహరించనున్నారు.

విక్రవాండి ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): విల్లుపురం జిల్లా విక్రవాండి నియోజకవర్గ ఉప ఎన్నికలో గెలిచిన అన్నియూరు శివ మంగళవారం ఉదయం శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. సచివాయంలోని స్పీకర్ ఛాంబర్‌లో ముఖ్యమంత్రి స్టాలిన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వ పెరుంతగై, డీపీఐ నేత తిరుమావళవన్ సమక్షంలో స్పీకర్ అప్పావు ఆయనతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురైమురుగన్, పొన్ముడి, కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు, ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, ఉదయనిధి, దామో అన్బరసన్, ఢిల్లీలోని ప్రభుత్వ ప్రతినిధి ఏకేఎస్ విజయన్ తదితరులు పాల్గొన్నారు.



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్

కావేరి జలాల కోసం

అవసరమైతే సుప్రీంకోర్టుకు

అఖిలపక్ష సమావేశంలో నిర్ణయం ● సీఎం స్టాలిన్ ప్రకటన

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కావేరి నదీ జలాల కోసం అవసరమైతే మళ్ళీ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని అఖిలపక్ష సమావేశంలో తీర్మానించినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రకటించారు. కావేరి ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం డెల్టా జిల్లాలకు ఈ యేడాది కర్ణాటక ప్రభుత్వం కావేరి జలాలను విడుదల చేయకుండా మొండి వైఖరిని ప్రదర్శిస్తోంది. రెండు రోజుల క్రితం కర్ణాటక ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం జరిపి తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేసే ప్రసక్తే లేదంటూ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కావేరి జలాల కోసం చేపట్టాల్సిన తదుపరి చర్యలపై చర్చించేందుకు సచివాలయంలో మంగళవారం ఉదయం ముఖ్యమంత్రి స్టాలిన్ అధిక్షతన అఖిల పక్షసమావేశం జరిగింది. ఈ సమావేశంలో కావేరి జలాలను పొందటానికి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. ఈ సమావేశంలో నీటివనరుల శాఖ మంత్రి దురైమురుగన్, కార్యదర్శి మణివాసగం, న్యాయనిపుణులు, డీఎంకే తరపున ఆర్ఎస్.భారతి, ఎంపీ విల్సన్, అన్నాడీఎంకే తరపున మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, ఓఎస్ మణియన్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరునాగరాజన్, ప్రధాన కార్యదర్శి కరుప్పు మురుగానంద, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుంతగై. పీఎంకే తరపున జీకే మణి, సదాశివం, సీపీఎం తరపున నాగైమాలి, సీపీఐ తరపున డి.రామచంద్రన్, ఎం.వీరపాండ్యన్, డీపీఐ నేత తొల్ తిరుమావళవన్, ఎస్ ఎస్.బాలాజీ, మనిదనేయ మక్కల్ కట్చి తరపును ఎం.హెచ్.జవాహిరుల్లా, తమిళగవాళ్వురిమై కట్చి తరపున వేల్‌మురుగన్, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చిట తరపున ఈశ్వరన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో చేసిన తీర్మానాలు గురించి సీఎం స్టాలిన్ మాట్లాడుతూ కావేరి ట్రిబ్యునల్ తుది తీర్పు, సుప్రీం కోర్టు తీర్పుననుసరించి కావేరి నిర్వాహక మండలి ఉత్తర్వు ప్రకారం కావేరి జలాలను విడుదల చేయని కర్ణాటక ప్రభుత్వం తీరు గర్హనీయమన్నారు. ఈ సమావేశంలో కావేరి జలాల కోసం చేపట్టాల్సిన చర్యలపై ప్రతిపక్షపార్టీల ప్రతినిధులంతా అభిప్రాయాలను వెల్లడించారన్నారు. గతేడాది సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం విడుదల చేయాల్సిన పరిమితి కంటే తక్కువగానే కావేరి జలాలను కర్ణాటక ప్రభుత్వం విడుదల చేడయంతో డెల్టా జిల్లాల రైతులంతా తీవ్రంగా నష్టపోవడంతో సుప్రీం కోర్టును ఆశ్రయించి జలాలను పొందగలిగామని చెప్పారు. ఈ యేడాది నైరుతి రుతుపవనాలు సానుకూలంగా ఉండి, భారీ వర్షాలు కురిసి జలాశయాలు నిండుతున్నా కర్ణాటక ప్రభుత్వం కావేరి జలాలు విడుదల చేసే ప్రసక్తే లేదంటూ భీష్మించడం గర్హనీయమన్నారు.

కర్ణాటక ప్రభుత్వానికి ఖండన...

ఈ సమావేశంలో చేసిన తొలి తీర్మానంలో కర్ణాటక ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు అఖిల పక్షం పేర్కొంది. 2007లో కావేరి ట్రిబ్యునల్ తుది తీర్పు, సుప్రీంకోర్టు 2018లో వెలువరించిన తీర్పును ఉల్లఘించే రీతిలో కావేరి జలాల నియంత్రణా కమిటీ జారీ చేసిన ఉత్తర్వులను బేఖాతరు చేసి డెల్టా జిల్లాలకు కావేరి జలాలలను విడుదల చేయబోమని ప్రకటించిన కర్ణాటక ప్రభుత్వతీరు ఖండిస్తూ తీర్మానం చేశారు. కావేరి జలాలను తక్షణమే విడుదల చేసేలా కర్ణాటక ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేయాలని మరొక తీర్మానం చేశారు.

కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకోవాలి...

కావేరి జలాల వివాదం పరిష్కారానికి కాంగ్రెస్ అధిష్టానం తప్పకుండా జోక్యం చేసుకోవాలని డీపీఐ నేత తొల్ తిరుమావళవన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన చేస్తూ కర్ణాటకలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో అక్కడి పాలకులకు నచ్చజెప్పి కావేరి జలాలు విడుదల య్యేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.



అన్నియూరు శివతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న స్పీకర్ అప్పావు

భారీగా ఐఏఎస్‌ల బదిలీ

జీసీసీ కమిషనర్‌గా కుమరగురుబరన్ ● తాంబరం కమిషనర్‌గా బాలచంద్రన్

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పాలన మరింత వేగవంతం చేయడంపై దృష్టి పెడుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్ ఆ మేరకు చర్యలు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా భారీస్థాయిలో ఐఏఎస్ అధికారులను బదిలీ చేశారు. ఈ వ్యవహారం అటు ప్రభుత్వ వర్గాల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతోంది. సహజంగా కొత్త ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లలో తమకు అనువైన, తామనుకున్న ప్రతిభ కలిగిన అధికారుల్ని గుర్తించి బదిలీలు చేయడం సహజం. కానీ డీఎంకే ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు పూర్తయ్యాక.. ఇప్పుడు ఒకేసారి ఇంతమంది ఐఏఎస్‌లకు స్థానచలనం కల్పించడం చర్చనీయాంశమైంది. ఇదిలా వుండగా గ్రేటర్ చెన్నై కమిషనర్ (జీసీసీ)గా జె.కుమరగురుబరన్ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఆ పదవిలో వున్న డాక్టర్ జె.రాధాకృష్ణన్ సహకార, ఆహార, వినియోగదారుల సంరక్షణశాఖ అదనపు ప్రధాన కార్యదర్శిగా బదిలీ అయ్యారు. అదే విధంగా సేలం కార్పొరేషన్ కమిషనర్ ఎస్.బాలచంద్రన్ తాంబరం కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఐఏఎస్‌ల బదిలీల వివరాలిలా...

పేరు	ప్రస్తుత స్థానం..	బదిలీ అయిన స్థానం
డాక్టర్ జేయా చంద్రకళ	ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్ డైరెక్టర్	రాణీపేట కలెక్టర్
ఎం.అరుణ	నీలగిరి కలెక్టర్	పుదుకోట కలెక్టర్
లక్ష్మీ భవ్య	వాణిజ్య పన్నుల విభాగ జాయింట్ కమిషనర్	నీలగిరి కలెక్టర్
పి.ఆకాష్	సిప్కాట్ ఈడీ	నాగపట్టినం కలెక్టర్
పి.రత్తినసామి	వాణిజ్య పన్నుల విభాగ (అడ్మిన్) జాయింట్ కమిషనర్	అరియలూరు కలెక్టర్
సీబీ ఆదిత్య సెంథిల్ కుమార్	ఆర్థికశాఖ ఉప కార్యదర్శి	కడలూరు కలెక్టర్
ఆర్.అళగుమీన	తాంబరం కార్పొరేషన్ కమిషనర్	కన్నియాకుమారి కలెక్టర్
గ్రేస్ లాల్‌రిండికి పచ్చువా	పరిశ్రమల శాఖ అదనపు కమిషనర్	పెరంబలూరు కలెక్టర్
సిమ్రాన్‌జీత్ సింగ్	మున్సిపల్ పరిపాలనాశాఖ జాయింట్ కమిషనర్	రామనాథపురం కలెక్టర్
డాక్టర్ నార్నవర్ మనీష్ శంకరరావ్	ఈరోడ్ జిల్లా రూరల్ డెలప్‌మెంట్ ఏజెన్సీ ప్రాజెక్ట్ ఆఫీసర్	ఈరోడ్ కార్పొరేషన్ కమిషనర్
డాక్టర్ జె.విజయరాణి	సహకార సంఘాల అదనపు రిజిస్ట్రార్	గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ జాయింట్ కమిషనర్ (ఎడ్యుకేషన్)
ఎస్.బాలచంద్రన్	సేలం కార్పొరేషన్ కమిషనర్	తాంబరం కార్పొరేషన్ కమిషనర్
ఎస్.మధుమతి	సిడ్కో డైరెక్టర్	పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి
డాక్టర్ కె.గోపాల్	సహకార, ఆహార, వినియోగదారుల సంరక్షణ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి	జంతు సంరక్షణ, డైరీ, మత్స్యశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి
హర్ సాహే మీనా	పౌరసరఫరాల శాఖ కమిషనర్	ప్రత్యేక పథకాల శాఖ ముఖ్యకార్యదర్శి
కె.వీరరాఘవ రావు	సాంకేతిక విద్యాశాఖ కమిషనర్	కార్మిక సంక్షేమం, స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ కార్యదర్శి
కుమార్ జయంతి	కార్మిక సంక్షేమశాఖ అదనపు ప్రధాన కార్యదర్శి	ఐటీ, డిజిటల్ సర్వీసెస్ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి
ధీరాజ్ కుమార్	ఐటీ, డిజిటల్ సర్వీసెస్ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి	హోం, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి
పి.అముద	హోం, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి	రెవెన్యూ, విపత్తుల నిర్వహణా శాఖ ముఖ్య కార్యదర్శి
వి.రాజారామన్	రెవెన్యూ, విపత్తుల నిర్వహణాశాఖ కార్యదర్శి	తమిళ్ అభివృద్ధి, సమాచార శాఖ కార్యదర్శి
డాక్టర్ ఎస్.సురేష్‌కుమార్	తమిళనాడు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్	వెనుకబడిన తరగతులు, ఎంబీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ అదనపు కార్యదర్శి
సీపీ రిషబ్	తిరువణ్ణామలై జిల్లా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్	ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శి
బి.విష్ణు చంద్రన్	రామనాథపురం కలెక్టర్	ప్రజా సంక్షేమశాఖ డిప్యూటీ కార్యదర్శి
ఎస్.వలర్మతి	రాణీపేట కలెక్టర్	సాంఘిక సంక్షేమ జాయింట్ కార్యదర్శి
జె.అన్నే మేరీ స్వర్ణ	అరియలూరు కలెక్టర్	హోం, ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ జాయింట్ సెక్రటరీ
శ్రవణ్‌కుమార్	కళ్లకుర్చి కలెక్టర్	రాష్ట్ర హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సంయుక్త కార్యదర్శి
షన్‌చొంగ్గం జటక్ చిరు	మత్స్యశాఖ ముఖ్య కార్యదర్శి	రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి
ఎ.షణ్ముగ సుందరం	రవాణా శాఖ కమిషనర్	చేనేత విభాగ డైరెక్టర్
ఆర్.గజలక్ష్మి	తమిళనాడు పాఠ్యపుస్తకాలు, విద్యాసేవల కార్పొరేషన్ ఎండి.	మత్స్యకారుల అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ

వీరితో పాటు కేంద్ర సర్వీసులో వున్న అశిష్‌కుమార్‌ను ఢిల్లీలోని తమిళనాడు హౌస్ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్‌గా నియమించారు.

ప్రధానితో గవర్నర్ భేటీ

● రాష్ట్రంలో శాంతిభద్రతలపై నివేదిక

ప్యారీస్, జూలై 16: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి మంగళవారం ఉదయం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అయ్యారు. సుమారు పావుగంట జరిగిన ఈ భేటీలో, కళ్లకుర్చి కల్తీ సారా దుర్ఘటన, తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్య, రాజకీయ పార్టీల ఆందోళన తదితర అంశాలపై వివరించినట్లు సమాచారం. గవర్నర్ రవి సోమవారం ఉదయం నగరం నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లిన విషయం తెలిసిందే. ఆయనతో పాటు కుటుంబ సభ్యులు కూడా వెళ్లారు. ఇది వ్యక్తిగత పర్యటన అని చెబుతున్నప్పటికీ, గవర్నర్ కార్యదర్శి, భద్రతాధికారి, సహాయకులు కూడా వెళ్లడం గమనార్హం. 18వ లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘనవిజయం సాధించడంతో నరేంద్ర మోదీ మూడో సారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు గవర్నర్ రవి ఢిల్లీకి వెళ్లారు. అయితే ప్రధాని అపాయింట్‌మెంట్ లేనందున రాష్ట్రానికి తిరిగొచ్చారు. ఈ నేపథ్యంలో, ఇప్పటికే పలు రాష్ట్రాల గవర్నర్లు ఢిల్లీ వెళ్లి మర్యాదపూర్వకంగా ప్రధాని మోదీకి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఆ రీతిలో గవర్నర్ రవి కూడా మంగళవారం ప్రధానితో సమావేశమయ్యారు. ప్రధానికి తమిళనాడులో నెలకొన్న సమస్యలు తదితర అంశాలను గవర్నర్ వివరించినట్లు సమాచారం. అయితే ప్రధానితో భేటీపై గవర్నర్ తన ఎక్స్‌పేజీలో సంతోషం వ్యక్తం చేశారు. 'దేశ ప్రధానిగా మూడో సారి ఎంపికైన ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిసి తమిళనాడు ప్రజల తరపున శుభాకాంక్షలు తెలియజేశాను. తమిళనాడు ప్రజలకు సేవలందించాన్న దృక్పథంతో ప్రధాని దూరదృష్టితో వ్యవహరించడం సంతోషంగా ఉంది" అని వివరించారు. ఇదిలా ఉండగా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల గవర్నర్ల పదవీకాలం త్వరలో ముగియనున్న నేపథ్యంలో, వారిని కొనసాగించాలా వద్దా అన్నదానిపై ప్రధాని యోచిస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రవి పర్యటన చర్చనీయాంశమైంది.



ప్రధాని నరేంద్ర మోదీని సన్మానిస్తున్న ఆర్ఎన్ రవి

భూకబ్జా కేసులో

బంధువు సహా మాజీ మంత్రి అరెస్టు

● విజయభాస్కర్‌ను త్రిశూర్‌లో అదుపులోకి తీసుకున్న సీబీసీఐడీ
● అజ్ఞాతవాసాన్ని ఛేదించిన ప్రత్యేక బృందాలు

అడయార్, జూలై 16: భూకబ్జా కేసులో అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి ఎంఆర్ విజయభాస్కర్‌ను సీబీసీఐడీ మంగళవారం అరెస్టు చేసింది. కేరళ రాష్ట్రం త్రిశూర్‌లో ఆయన ఉన్నట్టు పసిగట్టిన సీబీసీఐడీ ప్రత్యేక బృందం అక్కడికి వెళ్లి అరెస్టు చేశారు. అలాగే, మాజీ మంత్రికి ఆశ్రయం కల్పించిన బంధువు ప్రవీణ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. ఈ అరెస్టుతో 30 రోజుల గాలింపు చర్యలకు ఫుల్‌స్టాప్ పడింది. ఈ ఇద్దరిని కరూర్ తీసుకొచ్చి విచారణ జరుపనున్నారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన ఎంఆర్ విజయభాస్కర్ తన అధికారాన్ని ఉపయోగించి, కరూర్ జిల్లా మేల్‌కరూర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఖాదర్‌కు చెందిన రూ.100 కోట్ల విలువైన 22 ఎకరాలు కబ్జా చేశారు. ఆ తర్వాత ఈ స్థలానికి నకిలీ పత్రాలు సృష్టించి మేల్‌కరూర్ సబ్‌రిజిస్టార్ కార్యాలయంలో తమ పేర్లపై రిజిస్టర్ చేయించుకున్నారు. దీనిపై బాధితు డు కరూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ భూకబ్జా కేసులో మాజీ మంత్రి పాత్ర ఉండటంతో ప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే రంగంలోకి దిగిన సీబీసీఐడీ పోలీసులు.. ఈ కబ్జా కేసులో ఎంఆర్ విజయభాస్కర్‌తో సహా ఆయన సోదరుడు శంకర్, అనుచరులు భువరాజ్, ప్రవీణ్, రఘు సిద్ధార్థన్, మారప్పన్, సెల్వరాజ్, శోభన తదితరులు పాత్ర ఉన్నట్టు గుర్తించి మొత్తం 13 మందిపై కేసు నమోదు చేశారు.



ఎంఆర్ విజయ్ భాస్కర్

కోర్టులో చుక్కెదురు...

ఈ కేసులో తన అరెస్టు తప్పదని భావించిన మాజీ మంత్రి విజయభాస్కర్ కింది కోర్టు నుంచి హైకోర్టు వరకు ముందస్తు బెయిల్ కోసం పోరాటం చేశారు. అయినప్పటికీ ఆయనకు ఎక్కడా ఊరట లభించలేదు. దీంతో ఆయన రాష్ట్రం విడిచి పారిపోయారు. ఈ నేపథ్యంలో ఎంఆర్ అరెస్టు కోసం సీబీసీఐడీ డీఎస్పీ నేతృత్వంలో పది స్పెషల్ టీంలను ఏర్పాటు చేశారు. ఆయన ఫోన్ కాల్స్‌పై సైబర్ క్రైమ్ విభాగంతో నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఆయన తన న్యాయవాదితో వాట్సాప్ కాల్‌లో మాట్లాడిన విషయాన్ని సైబర్ క్రైమ్ విభాగం పసిగట్టింది. ఆయన త్రిశూర్‌లో ఉన్నట్టు గుర్తించి గత రెండు రోజులుగా అక్కడే మకాం వేశారు. ఈ పరిస్థితుల్లో మంగళవారం ఉదయం మొదట ఆయన బంధువు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకుని, ఆ తర్వాత ఎంఆర్ విజయభాస్కర్‌ను అరెస్టు చేశారు.

సమాచార దర్శిని

తపాలా శాఖలో ఉద్యోగావకాశాలు

ఐసిఎఫ్, జూలై 16: తపాలా శాఖలో ఖాళీగా వున్న 44,228 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. 10వ తరగతి ఉత్తీర్ణులై 18 నుంచి 40 ఏళ్ల లోపు వున్నవారు ఈ పోస్టులకు అర్హులు. తపాలా శాఖ అధికారి, సహాయ అధికారి, గ్రామీణ తపాలా అధికారి పోస్టులకు ఔత్సాహికులు ఆగస్టు 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. ఇతర వివరాలకు www.indiapostgdsonline.gov.in అనే వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చు.

24న సర్టిఫికెట్ల పరిశీలన

ఐసిఎఫ్, జూలై 16: రాష్ట్ర వ్యవసాయ శాఖ పోస్టులకు ఈ నెల 24వ తేదీ సర్టిఫికెట్ల పరిశీలన జరుగనుంది. సహాయ వ్యవసాయాధికారి, సహాయ ఉద్యానవనాధికారి పోస్టుల భర్తీకి టీఎన్‌పీఎస్సీ ఫిబ్రవరి 7వ తేదీ పరీక్ష నిర్వహించి, మార్చి 28వ తేదీన ర్యాంకుల జాబితా విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 24న బ్రాడ్వే బస్టాండు సమీపంలోని టీఎన్‌పీఎస్సీ కార్యాలయంలో సర్టిఫికెట్ల పరిశీలన జరుగనుంది. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నకళ్లతో హాజరు కావాలని, కాల్ లెటర్‌ను సంబంధిత వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అధికారులు సూచించారు.

సహకార దుకాణాల డోర్ డెలివరీ సేవలు

ఐసిఎఫ్, జూలై 16: సహకార శాఖ ఆధ్వర్యంలోని దుకాణాలు త్వరలో డోర్ డెలివరీ సేవలు అందించనున్నాయి. ఈ దుకాణాల్లో నిత్యావసర సరుకులు మార్కెట్ ధర కన్నా తక్కువగా విక్రయిస్తున్నారు. ప్రైవేటు సూపర్ మార్కెట్ లాగే సహకార దుకాణాల్లోనూ వినియోగదారులను ఆకట్టుకునేలా త్వరలో డోర్ డెలివరీ సేవలు అమలుపరచనున్నామని అధికారులు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి దరఖాస్తులాహ్వానం

ఐసిఎఫ్, జూలై 16: దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి రోజైన సెప్టెంబరు 5వ తేదీ అందజేయనున్న ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. రాజకీయ పార్టీలకు దూరంగా ఉండి, ఐదేళ్ల ఉద్యోగానుభవం కలిగి, ప్రైవేటు ట్యూషన్లు నడపని ఉపాధ్యాయులు ఈ నెల 24వ తేదీ లోగా ఎమిస్ వెబ్‌సైట్‌లో తమ వివరాలు అప్‌లోడ్ చేయవచ్చని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ కన్నప్పన్ తెలిపారు.

తాత్కాలిక టీచర్ పోస్టులకు....

నగరంలోని ఆది ద్రావిడుల సంక్షేమ ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా వున్న సెకండరీ గ్రేడ్ టీచర్ (తాత్కాలిక) పోస్టులకు ఈ నెల 19వ తేదీ సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని చెన్నై జిల్లా కలెక్టర్ రశ్మి సిద్ధార్థ్ జగ్డే తెలిపారు. వలసరవాక్కం, పెరుంబాక్కం ప్రాంతాల్లో వున్న పాఠశాలల్లో ఖాళగా ఈ పోస్టులు జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యాలయంలో నేరుగా గానీ, రిజిస్టర్ పోస్టు ద్వారా కానీ దరఖాస్తు చేసుకోవచ్చు. నెలకు రూ.12 వేల చొప్పున అందజేస్తారు.

మంగళూరు-రామేశ్వరం మధ్య కొత్త రైలు

ఐసిఎఫ్, జూలై 16: కర్ణాటక రాష్ట్రం మంగళూరు-రామేశ్వరం మధ్య కొత్త రైలు సేవలు ప్రారంభించనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. రామేశ్వరం పాంబన్ రైలు వంతెన సమీపంలో రూ.550 కోట్లతో బ్రిడ్జి నిర్మాణపనులు పూర్తికానున్నాయి. ఇటీవల ట్రయల్ రన్ కూడా నిర్వహించారు. ఈ మార్గంలో కొత్త రైళ్లను నడపాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. దీంతో రైల్వే శాఖ ప్రస్తుతం మంగళూరు-రామేశ్వరం మధ్య త్వరలో కొత్త రైలు నడుపనున్నట్లు అధికారులు తెలిపారు.

మహాబలేశ్వరానికి ఆధ్యాత్మిక రైలు

ఐసిఎఫ్, జూలై 16: మదురై నుంచి మహారాష్ట్ర మహాబలేశ్వర్‌కు ఆగస్టు 4న ప్రత్యేక ఆధ్యాత్మిక రైలు నడుపనున్నారు. మదురై నుంచి బయల్దేరి తిరునల్వేలి, నాగర్‌కోయిల్, సేలం, చెన్నై మీదుగా సాగే 11 రోజుల యాత్రకు సెకండ్ క్లాస్ ఏసీ ఛార్జీ రూ.38,950, థర్డ్ క్లాస్ ఏసీ రూ.31,900 గా నిర్ణయించారు. ఇతర వివరాలకు 7305858585 నెంబరు సంప్రదించవచ్చు.

చదురగిరి కొండపైకి వెళ్ళేందుకు అనుమతి

అడయార్, జూలై 16: విరుదునగర్ జిల్లాలోని పశ్చిమ కనుమల్లో ప్రసిద్ధిగాంచిన చదురగిరి సుందరమహాలింగం ఆలయానికి వెళ్ళేందుకు భక్తులకు నాలుగు రోజుల పాటు ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ కొండపై ఉన్న ఆలయంలో ప్రతి అమావాస్య, పౌర్ణమి రోజుల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. ఈ పూజల్లో పాల్గొనేందుకు భక్తులు భారీ సంఖ్యలో వెళుతుంటారు. అయితే, పౌర్ణమి, అమావాస్య సమయాల్లో ఆరు రోజులు, ప్రదోష సమయంలో రెండు రోజులు కలిపి మొత్తం నెలలో ఎనిమిది రోజుల పాటు అనుమతిస్తుంటారు. ఇందులో భాగంగా ఈ నెల 20వ తేదీ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 19వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు భక్తులు చదురగిరి కొండపైకి వెళ్ళేందుకు అటవీ శాఖ అనుమతిచ్చింది.

అంత్యోదయ రైళ్లు రద్దు

ఐసిఎఫ్, జూలై 16: తాంబరం రైల్వే యార్డులో ఈ నెల 23 నుంచి ఆగస్టు 14వ తేది వరకు అభివృద్ధి పనులు జరుగనున్నాయి. ఈ కారణంగా రైలు సేవల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. తాంబరం-నాగర్‌కోయిల్‌కు రాత్రి 11 గంటలకు బయల్దేరే అంత్యోదయ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 23 నుంచి 31వ తేది వరకు, నాగర్‌కోయిల్-తాంబరం సాయంత్రం 3.50 గంటలకు బయల్దేరే రైలు ఈ నెల 22 నుంచి 31వ తేది వరకు రద్దు కానున్నాయి.

ఓఎంఆర్‌లో మెట్రోయార్డు

ఐసిఎఫ్, జూలై 16: స్థానిక ఓఎంఆర్‌లో మెట్రో యార్డు కోసం 60 ఎకరాలను సీఎంఆర్‌ఎల్ ఎంపిక చేసింది. నగరంలో రెండో విడత మెట్రోరైల్ పథకం మూడు మార్గాల్లో జరుగుతోంది. ఓఎంఆర్‌లో ఎస్‌ఆర్‌పీ టూల్స్ నుంచి సిరుచేరి వరకు 20 కి.మీటర్ల వరకు పనులు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓఎంఆర్ కుమరన్ నగర్ జంక్షన్ నుంచి 1.5 కి.మీ దూరంలో వున్న నూక్కంపాళయం లింక్‌రోడ్డులో ఆక్రమణల్లో వున్న 60 ఎకరాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. ఈ స్థలంలో 50 ఎకరాల్లో మెట్రోయార్డుకు, 10 ఎకరాలను ప్రభుత్వ కార్యాలయాలకు ప్రభుత్వం కేటాయించింది. టెండర్ల ఖరారు కాసే మెట్రోయార్డు పనులు ప్రారంభించనున్నట్లు సీఎంఆర్‌ఎల్ అధికారులు తెలిపారు.

రూ.4 కోట్ల నగదు స్వాధీనం కేసు...

సీబీసీఐడీ విచారణకు నాగేంద్రన్ హాజరు

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏప్రిల్ 6న తాంబరం రైల్వేస్టేషన్ వద్ద ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.4 కోట్ల నగదు పట్టుబడిన వ్యవహారానికి సంబంధించి బీజేపీ శాసనసభ్యుడు నయినార్ నాగేంద్రన్ సోమవారం ఉదయం సీబీసీఐడీ విచారణకు హాజరయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో నయినార్ నాగేంద్రన్ తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ నేపథ్యంలో తాంబరం రైల్వేస్టేషన్‌లో రైలులో తిరునల్వేలి తరలించేందుకు సిద్ధంగా ఉన్న రూ.4కోట్లను ఎన్నికల సంఘం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆ నగదు తరలిస్తున్న సతీష్, నవీన్, పెరుమాళ్ అనే వారిని అరెస్టు చేశారు. పోలీసుల విచారణలో ఆ నగదు తిరునల్వేలి లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి నయినార్ నాగేంద్రన్ ఎన్నికల ఖర్చుల కోసం తీసుకెళుతున్నట్లు ఆ ముగ్గురు వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ కేసు విచారణ సీబీసీఐడీకి అప్పగించారు. ఆ తర్వాత పలువురు బీజేపీ నాయకులు సహా 15 మంది వద్ద సీబీసీఐడీ పోలీసులు విచారణ జరిపి కీలకమైన ఆధారాలను సేకరించారు. ముందుగా ఈ కేసుకు సంబంధించి బీజేపీ రాష్ట్ర కోశాధికారి ఎస్‌ఆర్ శేఖర్‌ను విచారణ జరిపారు. ఆ తర్వాత విచారణకు రావాలని బీజేపీ ఎమ్మెల్యే నయినార్ నాగేంద్రన్‌కు పలుమార్లు సమన్లు జారీ చేసినా ఆయన హాజరుకాలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం 10.20 గంటలకు నయినార్ నాగేంద్రన్ సీబీసీఐడీ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఈ విచారణ సాయంత్రం వరకూ కొనసాగింది.



ఎగ్మూరులోని సీబీసీఐడీ కార్యాలయానికి వెళ్తున్న నయినార్ నాగేంద్రన్

నిందితులను అరెస్టు చేస్తేనే మృతదేహాలను తీసుకుంటాం

● నెల్లికుప్పం హత్యలపై బంధువుల ఆందోళన

అడయార్, జూలై 16: కడలూరు జిల్లా నెల్లికుప్పం సమీపంలోని కారామణికుప్పం సీతారామన్ నగర్‌లో ఒకే ఇంటిలో ముగ్గురు అనుమానాస్పద రీతిలో హత్యకు గురయ్యారు. ఈ కేసులో హంతకులను అరెస్టు చేసేంత వరకు మృతదేహాలను తీసుకోబోమని మృతుల బంధువులు ఆందోళనకు దిగారు. ఈ కుప్పానికి చెందిన సురేష్ అనే వ్యక్తికి భార్య కమలేశ్వరి (62), సురేంద్ర కుమార్, సుగంత్ కుమార్ అనే ఇద్దరు కుమారులున్నారు. యేడాది క్రితం సురేష్ చనిపోయారు. సుగంత్ కుమార్ హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. ఈయన కుమారుడు ఇషాన్ తల్లి దగ్గర ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో తన తల్లివద్ద ఉండే కుమారుడు ఇషాన్‌ను చూసేందుకు సుగంత్ గ్రామానికి వచ్చి వెళుతుంటాడు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున కమలేశ్వరి ఇంటి నుంచి నల్లటి పొగలు రావడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నెల్లికుప్పం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇంటిలోకి వెళ్ళి చూడగా, కమలేశ్వరి, సుగంత్ కుమార్, ఇషాన్ మూడు గదుల్లో కాలిపోయి కనిపించారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. ఇదిలావుంటే, బెంగుళూరులో ఉండే పెద్దకుమారుడు సురేంద్ర కుమార్ గ్రామానికి చేరుకుని మృతదేహాలను చూసి విలపించాడు. అంతేకాకుండా హత్య చేసిన నిందితులను తక్షణం గుర్తించి అరెస్టు చేయాలని, అప్పటివరకు మృతదేహాలను తీసుకోబోమని తమ బంధువులతో కలిసి ఆందోళనకు దిగారు. దీంతో గత రెండు రోజులుగా నెల్లికుప్పంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

శక్తి అమ్మన్ క్లినిక్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగం

వేలూరు, జూలై 16: వేలూరులోని శక్తి అమ్మన్ క్లినిక్‌లో ప్లాస్టిక్ సర్జరీ విభాగం ఏర్పాటైంది. మంగళవారం నారాయణి ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ఎస్.బాలాజీ నేతృత్వంలో వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం ఈ విభాగాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంకా శ్రీనాధ్, డాక్టర్ గీతా ఇనియన్, డాక్టర్ హర్ష, డాక్టర్ దేవమణి పాండ్యన్ తదితరులు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ సర్జరీ విభాగాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ జీవీ సెల్వం తదితరులు

ఉత్తమ వైద్యులకు పురస్కారాల ప్రదానం

వేలూరు, జూలై 16: వేలూరు డివిజన్ కాట్పాడి ఇండియన్ రెడ్ క్రాస్ సంఘం ఆధ్వర్యంలో వైద్యులకు పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. కాట్పాడి రెడ్ క్రాస్ అధ్యక్షుడు జనార్ధనన్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో, ఉపాధ్యక్షుడు శ్రీనివాసన్, వైద్య కమిటీ అధ్యక్షుడు డాక్టర్ దీనబంధు, కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కేవీ కుప్పం డివిజన్ వైద్యాధికారి శంకర్ గణేశ్, ధారాపడవేడు ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం అధికారి లక్ష్మి, వేలూరు ప్రభుత్వ ఆసుపత్రి మహిళా సంక్షేమ డాక్టర్ శాలిని, డాక్టర్ శృతి దామోదరన్ తదితరులకు ఈ పురస్కారాలు ప్రదానం చేశారు.



పురస్కారాలతో వైద్యులు

489 మందికి గృహాల కేటాయింపు

వేలూరు, జూలై 16: వేలూరు జిల్లా గుడియాత్తం పంచాయతీ యూనియన్‌లో కలైంజర్ కనవు ఇల్లం పథకం కింద 489 మందికి గృహాల కేటాయింపు జరిగింది. వేలూరు ఎంపీ కదిర్ ఆనందన్ ఈ మేరకు పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు విజయన్, గుడియాత్తం యూనియన్ అధ్యక్షుడు సత్యానందం, కేవీ కుప్పం యూనియన్ అధ్యక్షుడు రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు పత్రాలను అందిస్తున్న ఎంపీ

అగరంచ్చేరిలో జిల్లా కలెక్టర్ తనిఖీలు

వేలూరు, జూలై 16: వేలూరు జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి మంగళవారం ఆనైకట్టు డివిజన్ అగరంచ్చేరిలో తనిఖీలు నిర్వహించారు. ముందుగా అక్కడి గ్రామ నిర్వాహణాధికారి కార్యాలయాన్ని పరిశీలించిన అనంతరం.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, అక్కడున్న వంటగది,. చిన్నారుల ఆహారంలో అందించే కోడిగుడ్లను కూడా తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట ఆనైకట్టు తహశీల్దారు తదితరులున్నారు.



గ్రామ నిర్వహణాధికారి కార్యాలయంలో కలెక్టర్

నేటినుంచి శశికళ రాష్ట్ర పర్యటన

ప్యారీస్, జూలై 16: అన్నాడీఎంకేను ఏకం చేయాలనే లక్ష్యంతో వీకే శశికళ బుధవారం నుంచి రాష్ట్ర పర్యటన చేపట్టనున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 39 స్థానాల్లో పోటీచేసిన అన్నాడీఎంకే కూటమి చిత్తుగా ఓడిపోయింది. కూటమి బలంగా లేకపోవడం, అన్నాడీఎంకేలో ఏర్పడిన చీలికలే ఈ ఓటమికి కారణమని ఆ పార్టీ సీనియర్లు, కార్యకర్తలు ఏకరువు పెట్టారు. ఈ నేపథ్యంలో 2026 అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ తిరిగి అధికారం చేపట్టేందుకు, అన్ని వర్గాలు ఒకటి కావాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం, శశికళ కోరుతున్నారు. ఈ క్రమంలో దివంగత మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత పట్ల విశ్వాసంతో ఉన్న సీనియర్లు, అసంతృప్తి నేతలతో పాటు ప్రజలను కూడా కలిసి శశికళ వారి అభిప్రాయాలు తెలుసుకోనున్నారు. ఈ నేపథ్యంలో, 'అమ్మావిన్ వలియిల్ మక్కల్ పయనం' అనే పేరుతో బుధవారం సాయంత్రం 3 గంటలకు కుట్రాలం జలపాతాల ప్రాంగణం నుంచి ప్రారంభమయ్యే పర్యటన తెన్‌కాశి అసెంబ్లీ నియోజకవర్గంలో రాత్రి 9 గంటల వరకు కొనసాగుతుంది. దారిలో తెన్‌కాశి పట్టణం, కిలపులియూర్, మేల్‌పట్టపురచ్చి ప్రాంతాల్లో రోడ్ షోలో పాల్గొంటారు. ముందుగా సుందరపాండ్యపురంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు ముత్తు రామలింగ దేవర్ విగ్రహానికి, ఆ తర్వాత పావూరు సత్రంలో ఉన్న కామరాజర్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. 18వ తేది రెండో రోజు పర్యటనను ఆమె కడయనల్లూర్ నియోజకవర్గంలో చేపడతారు.

మదురైలో ఎన్టీకే నేత దారుణహత్య

● వాకింగ్ వెళ్తుండగా కత్తులతో దాడి

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మదురైలో మంగళవారం ఉదయం నామ్ తమిళర్ కట్చి (ఎన్టీకే) స్థానిక నాయకుడిని గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్లతో దాడిచేసి హత్యచేశారు. మంత్రి పళనివేల్ త్యాగరాజన్ నివాసానికి కూతవేటు దూరంలో ఈ ఘటన జరిగింది. మదురై సెల్లూరు ప్రాంతానికి చెందిన బాలసుబ్రమణ్యం నామ్ తమిళర్ కట్చి మదురై నార్త్ నియోజకవర్గ డిప్యూటీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. మంగళవారం ఉదయం తల్లాకుళం వల్లభాయ్ రోడ్డులో వాకింగ్ చేస్తుండగా నలుగురు దుండగులు అటకాయించి గొడవపెట్టుకుని వేటకొడవళ్లతో దాడి చేశారు. వారి బారి నుంచి తప్పించుకుని బాలసుబ్రమణ్యం పరుగులు తీసినా వెంటాడి మరీ నరికారు. దీంతో బాలసుబ్రమణ్యం అక్కడికక్కడే మరణించారు. తర్వాత దుండగులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ హత్య సమాచారం అందుకున్న తల్లాకుళం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాలసుబ్రమణ్యం మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో బాలసుబ్రమణ్యంకు ఆయన బంధువు మధ్య పాతకక్షలున్నాయని తెలిసింది. ఆ నేపథ్యంలోనే ఈ హత్య జరిగి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నారు. రాజధాని నగరం చెన్నైలో ఈ నెల 5న జరిగిన బీఎస్పీ నేత ఆమ్‌స్ట్రాంగ్ హత్య సృష్టించిన కలకలం తగ్గకముందే మదురై నగరంలో మంత్రి పళనివేల్ త్యాగరాజన్ నివాసానికి కూతవేటు దూరంలో ఎన్టీకే నేత దారుణహత్యకు గురికావటం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది.



బాలసుబ్రమణ్యం (ఫైల్‌ఫొటో)

సీమాన్ ఖండన...

మదురైలో పార్టీ స్థానిక నాయకుడు బాలసుబ్రమణ్యం దారుణహత్యను నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని చెప్పడానికి ఈ సంఘటనే నిదర్శనమని, వాకింగ్‌కు వెళుతున్న వ్యక్తిని దుండగులు హత్యచేసినట్లు తెలియగానే తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. పోలీసులు, ఇంటెలిజెన్స్ విభాగం పూర్తిగా నిర్వీర్యమై పోయాయయని ఆయన ఆరోపించారు. బాలసుబ్రమణ్యం కుటుంబీకులకు సీమాన్ ప్రగాఢ సంతాపం తెలిపారు.

ఘనంగా కామరాజర్‌కు పాలాభిషేకం

ప్యారీస్, జూలై 16: దివంగత మాజీ ముఖ్యమంత్రి కామరాజర్ 122వ జయంతి సందర్భంగా చూలైలో ఆయన విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. చూలై టీకే మొదలి వీధి స్వాతంత్ర్య సమరయోధుడు పి.గోవిందరాజ్ వారసులు పుణ్యకోటి ఏర్పాటుచేసిన కామరాజర్ విగ్రహానికి సోమవారం విశ్వభారతి ఎయిడెడ్ పాఠశాల విద్యార్థులు, టీచర్లు, టీఎన్‌సీసీ ప్రధాన కార్యదర్శి ఎన్.రంగభాష్యం, చెన్నై పశ్చిమ జిల్లా కాంగ్రెస్ నిర్వాహక కమిటీ సభ్యుడు పి.సురేష్‌బాబు తదితరులు ఘనంగా నివాళులర్పించారు.



చూలైలో కామరాజర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహిస్తున్న రంగభాష్యం, సురేష్‌బాబు తదితరులు

కర్ణాటక డ్యాం నుంచి నీరు విడుదల

పెరంబూర్, జూలై 16: కర్ణాటక రాష్ట్రం నుంచి 36,579 ఘనపుటడుగుల నీరు కావేరి నదిలోకి విడుదల చేస్తున్నారు. ఆ రాష్ట్రంలో భారీవర్షాల కారణంగా కబిని డ్యాం పూర్తిస్థాయికి చేరుకోగా, కృష్ణరాజసాగర్ డ్యాంకు భారీగా నీరు చేరుతోంది. డ్యాం భద్రత దృష్ట్యా మంగళవారం ఉదయం విడుదల చేసిన 29,000 ఘనపుటడుగుల నీటి పరిమాణాన్ని సాయంత్రం 36,500 ఘనపుటడుగులకు పెంచారు.

మేట్టూరు డ్యాంకు పెరిగిన ఇన్‌ఫ్లో : కర్ణాటక నుంచి విడుదల చేస్తున్న నీరు రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన పిల్లిగుండు, హొగెనేకల్ మీదుగా సేలం జిల్లా మేట్టూరు డ్యాంకు చేరుతోంది. మంగళవారం ఉదయం డ్యాంలోకి 5,054 ఘనపుటడుగుల మేర వస్తున్న నీరు, సాయంత్రానికి 16,577 ఘనపుటడుగులకు పెరిగింది. దీంతో, ఉదయం 43.83 అడుగులుగా ఉన్న మేట్టూరు డ్యాం నీటిమట్టం సాయంత్రానికి 44.62 అడుగులకు పెరిగింది. డ్యాం నుంచి తాగునీటి అవసరాలకు 1,000 ఘనపుటడుగుల నీటిని విడుదల చేస్తున్నారు.


గ్రూప్-2, 2ఏ పరీక్షలకు ఉచిత శిక్షణ

పెరంబూర్, జూలై 16: గ్రూప్-2, 2ఏ పోస్టుల భర్తీకి నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో... తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-2 విభాగంలో 507 పోస్టులు, గ్రూప్-2ఏ లో 1,820 పోస్టుల భర్తీకి గత నెల 20వ తేది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గిండీలోని జిల్లా ఉద్యోగ అవకాశాలు, శిక్షణ సంస్థలో సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉచిత శిక్షణ అందించనున్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు decgc.chennai24@gmail.com అనే ఈ-మెయిల్‌లో పేరు నమోదుచేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

కుంభకోణం దుర్ఘటనకు 20 యేళ్లు!

● అగ్నికి ఆహుతైన 94 మంది చిన్నారులకు కన్నీటి నివాళి

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా కుంభకోణం కాశిరామన్ వీధిలో శ్రీకృష్ణా ప్రాథమిక పాఠశాలలో 2004 జూలై 16న సంభవించిన భారీ అగ్నిప్రమాదంలో తరగతి గదుల్లో పాఠాలు చదువుతున్న 94 మంది బాలబాలికలు ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన జరిగి ఇరవై యేళ్లు గడిచాయి. ఆ పసిబిడ్డలను కోల్పోయిన తల్లిదండ్రులు ఇంకా శోక సముద్రంలోనే ఉన్నారు. మంగళవారం ఉదయం ఆ చిన్నారుల ద్విదశ (20వ) సంస్మరణదినం సందర్భంగా ఆ పాఠశాల ఎదుట శ్రద్ధాంజలి సభ నిర్వహించారు. ఆ తర్వాత కుంభకోణం పాలకరైలో ఉన్న స్మారక మండపంలో 94 మంది చిన్నారుల ఫొటోలతో బ్యానర్‌ను పూలతో అలంకరించారు. ఆ బ్యానర్ వదకద చిన్నారులను కోల్పోయిన తల్లిదండ్రులు, బంధువులు, స్థానికులు, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు నివాళులర్పించారు. చిన్నారుల తల్లిదండ్రులు కొవ్వొత్తులు వెలిగించి అంజలి ఘటిస్తూ విలపించారు. అగ్నికి ఆహుతైన 94 మంది చిన్నారులను స్మరిస్తూ మంగళవారం సాయంత్రం కుంభకోణం మహామఖం కొలను వద్ద తల్లిదండ్రులు మోక్షదీపం వెలిగించారు.



చిన్నారుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న తల్లిదండ్రులు, స్థానికులు - కొవ్వొత్తులు వెలిగిస్తున్న స్థానికులు

'చండాలుడు' పదం ఉపయోగిస్తే అంటరానితనం కేసు

ఐసిఎఫ్, జూలై 16: చండాలర్ (చండాలుడు) అనే పదం ఉపయోగిస్తే అంటరానితనం కేసు నమోదు చేసి చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ హెచ్చరించింది. ఒక్కో కులానికి వేర్వేరు పేర్లుండడం తెలిసిన విషయమే అయినప్పటికీ అసమానతలున్నాయి. కొన్నిచోట్ల ఉన్నత వర్గాలకు చెందినవారు దళితులను చండాలుడుగా సంబోధించడం శోచనీయం. ఇటీవల ఇతరులను కింపరిచేలా ఈ పదాన్ని ఎక్కువగా వినియోగిస్తున్నారు. దీనిపై ఫిర్యాదులందడంతో తీవ్రంగా స్పందించిన రాష్ట్ర, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఇలాంటి పదప్రయోగం చేసేవారిపై అంటరానితనం కేసు నమోదు చేసి చర్యలు చేపడతామని హెచ్చరించింది.

విద్యార్థుల మధ్య కులఘర్షణ

● ఉపాధ్యాయుల బదిలీ

ఐసిఎఫ్, జూలై 16: విద్యార్థుల మధ్య కులచిచ్చు రగిలించి ఘర్షణలకు పాల్పడేలా ప్రేరేపించిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులందరినీ కలెక్టర్ ఉత్తర్వుల మేరకు అధికారులు బదిలీ చేశారు. తిరునల్వేలి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మధ్య అప్పుడప్పుడు కులఘర్షణలు జరుగుతున్నాయి. ఇటీవల జరిగిన ఘర్షణల్లో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఇరువర్గాలకు చెందిన ఉపాధ్యాయుడు వల్లే ఈ ఘర్షణలు జరుగుతున్నాయని నిర్ధారణ కావడంతో కలెక్టర్ కార్తికేయన్ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని గంగైకొండాన్, తిరునల్వేలి, మరుదకుళం, నాంగునేరి, కల్లిడైకుర్చి, వల్లియూరు, రాధాపురం ప్రాంతాల్లో వున్న ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరినీ అధికారులు బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో జిల్లా జడ్జి మృతి

పెరంబూర్, జూలై 16: రోడ్డు దాటేందుకు యత్నించిన జిల్లా జడ్జి, ద్విచక్రవాహనం ఢీకొని మృతిచెందాడు. పొల్లాచ్చి సమీపం చిన్నపాళయం ప్రాంతానికి చెందిన కరుణానిధి (58) నీలగిరి జిల్లా కోర్టులో అదనపు న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. సొంత పనులపై ఆయన ఇంటి నుంచి కారులో వచ్చి ఉడుమలై రోడ్డులో కారు ఆపి రోడ్డు దాటుతున్న సమయంలో, పొల్లాచ్చి నుంచి వేగంగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో అదుపుతప్పి కిందపడిన కరుణానిధి తలకు బలమైన గాయాలై మృతిచెందారు. సమాచారం అందుకున్న పొల్లాచ్చి ఈస్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. కేసు నమోదుచేసిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా పరారైన ద్విచక్ర వాహనదారుడి కోసం గాలిస్తున్నారు.



జడ్జి కరుణానిధి (ఫైల్‌ఫొటో)

బాలికపై అత్యాచారం.. రౌడీ అరెస్ట్

ప్యారీస్, జూలై 16: స్థానిక రాయపేట ప్రాంతంలో 13 ఏళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన రౌడీని పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 12న పాఠశాలకు వెళ్లిన చిన్నారి సాయంత్రం 6 గంటలు దాటినా ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె తల్లి పాఠశాలకు వెళ్లి టీచర్లను అడిగారు. బాలిక పాఠశాలకు రాలేదని వారు చెప్పడంతో ఆమె కోసం పలు ప్రాంతాల్లో గాలించినా జాడ తెలియలేదు. ఈ నేపథ్యంలో, ఇరుగుపొరుగు వారు అదే ప్రాంతానికి చెందిన మణికంఠన్ అనే రౌడీతో బాలిక వెళ్లినట్లు తెలుసుకొని రాయపేట మహిళా పోలీస్‌స్టేషన్‌లో తల్లి ఫిర్యాదు చేశారు. కేసు నమోదుచేసి విచారణ జరిపిన పోలీసులు రౌడీ మణికంఠన్ బాలికను బెదిరించి తన ఇంట్లో బంధించినట్లు తెలిసింది. దీంతో సోమవారం పోక్సో చట్టం కింద అతనిని అరెస్ట్ చేశారు. అతనిపై పలు దోపిడీ కేసులు, దాడులకు సంబంధించినవి మొత్తం 16 కేసులున్నట్లు తెలిసింది.

అద్దె ఇంటిలో అగ్నిప్రమాదం

● ముగ్గురు లారీ డ్రైవర్ల దుర్మరణం



అగ్నిప్రమాదం సంభవించిన ఇల్లు - ప్రమాద స్థలం వద్ద విచారణ జరుపుతున్న అగ్నిమాపక దళం సభ్యులు

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం సూలురు వద్ద లారీ డ్రైవర్లు ఉంటున్న అద్దె ఇంటిలో మంగళవారం వేకువజాము సంభవించిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు లారీ డ్రైవర్లు మరణించారు. మరో నలుగురు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. సూలూరు సమీపం ముత్తుగౌండన్‌పుదూరులో తిరుమూర్తి వరుసగా పది ఇళ్లు నిర్మించి వాటిని అద్దెకు ఇచ్చారు. ఆ క్వార్టర్స్‌లోని ఓ ఇంటిలో కంటైనర్ లారీ డ్రైవర్ అళగర్ రాజా, అతడి స్నేహితులైన మరికొంతమంది డ్రైవర్లు ఉంటున్నారు. సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు వీరంతా వంటగదిలో ఆహారం తయారు చేస్తున్నారు. ఆ సమయంలో అళగర్‌రాజా ఓ పెద్ద క్యాన్‌లోని పెట్రోల్‌ను చిన్న క్యాన్‌లోకి పోస్తుండగా ఉన్నట్టుండి నిప్పంటుకుంది. క్షణాలలో ఆ గది అంతా మంటలు వ్యాపించాయి. ఆగదిలో పెట్రోలు క్యాన్లు, డీజిల్ క్యాన్లు కూడా ఉండటంతో వాటికి కూడా మంటలు అంటుకున్నాయి. మంటల్లో ఏడుగురు డ్రైవర్లు చిక్కుకున్నారు. పక్కవాటాల్లో నివసిస్తున్నవారంతా మంటలను ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్ళి మంటలను ఆర్పేందుకు పోరాడారు. వంటగదిలో మంటలు పక్కగదిలోని గ్యాస్ సిలిండర్‌కు అంటుకోకుండా జాగ్రత్తగా బయటకు తెచ్చారు. అప్పటికే మంటల్లో చిక్కుకుని అళగర్ రాజా, చిన్న కరుప్పు, ముత్తుకుమార్ అనే ముగ్గురు డ్రైవర్లు మరణించారు. దినేష్, మనోజ్, వీరమణి, పాండీశ్వరన్ అనే నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు వీరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సూలూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

సెంథిల్ బాలాజీ రిమాండ్ పొడిగింపు

పెరంబూర్, జూలై 16: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ రిమాండ్‌ను 47వ సారి పొడిగిస్తూ న్యాయమూర్తి అల్లి ఉత్తర్వులు జారీచేశారు. చట్టవ్యతిరేక నగదు బదిలీ నిరోధక చట్టం కింద గత ఏడాది మాజీ మంత్రి సెంథిల్ బాలాజీని ఈడీ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం ఆయన పుళల్ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. ఆయన రిమాండ్ మంగళవారంతో ముగియడంతో ఈ నెల 18వ తేది వరకు రిమాండ్ పొడిగిస్తూ చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి అల్లి ఉత్తర్వులు జారీచేశారు.

బాలికకు లైంగిక వేధింపులు..

వృద్ధుడికి జీవితఖైదు

అడయార్, జూలై 16: కోయంబత్తూరు జిల్లాలో బాలికను లైంగికంగా వేధించిన కేసులో ఒక వృద్ధుడికి జీవిత కారాగారశిక్ష విధిస్తూ కోవై పోక్సో కోర్టు తాజాగా తీర్పునిచ్చింది. జిల్లాలోని పోత్తనూరు, పిళ్ళైయార్‌పురానికి చెందిన సెల్వరాజ్ (64) 2017-19 మధ్య కాలంలో బాలికను లైంగికంగా వేధించాడు. దీనిపై విద్యార్థి చదివే పాఠశాల ఉపాధ్యాయురాలు, బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు... సెల్వరాజ్‌ను అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ కోవై పోక్సో కోర్టులో సాగింది. ఈ కేసులోని ఆధారాలను పరిశీలించిన న్యాయమూర్తి జి.కులశేఖరన్ నిందితుడు సెల్వరాజ్‌ను ముద్దాయిగా ప్రకటించి, జీవిత శిక్షతో పాటు పది వేల రూపాయల అపరాధం కూడా విధిస్తూ తీర్పునిచ్చారు.

కర్ణాటక వైఖరికి నిరసనగా రైతుల ధర్నా

అడయార్, జూలై 16: రాష్ట్రానికి కావేరీ జలాలను విడుదల చేసే అంశంలో కర్ణాటక ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తూ కావేరీ డెల్టా ప్రాంతానికి చెందిన రైతులు మంగళవారం వివిధ ప్రాంతాల్లో నిసరనలు వ్యక్తం చేస్తూ, ధర్నాలు చేశారు. తిరువారూరు జిల్లాలో జరిగిన ధర్నా కార్యక్రమంలో తిరుత్తురైపూండి ఎమ్మెల్యే మారిముత్తు సారథ్యం వహించారు. రైలురోకోలో పాల్గొన్న ఉభయ కమ్యూనిస్టు పార్టీలకు చెందిన నేతలు, కార్యకర్తలను అరెస్టు చేశారు.

రిజిస్ట్రేషన్ కోసం 15 వరకు అవకాశం

అడయార్, జూలై 16: అఖిల భారత ముత్తమిళ్ మురుగన్ సదస్సులో పాల్గొనేదుకు ఆసక్తి ఉన్న వారు వచ్చే నెల 15వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. ఈ విషయంపై హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. దిండిగల్ జిల్లా పళనిలో ఆగస్టు 24, 25 తేదీల్లో ఈ మహానాడు జరుగనుంది. ఇందులో పాల్గొనేందుకు ఆసక్తిగల వారు "https://muthamizhmuruganmaanadu2024.com' అనే లింకులో తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఈ రిజిస్ట్రేషన్ కోసం గడువును వచ్చే నెల 15వ తేదీ వరకు పొడగించినట్టు పేర్కొంది.

కష్టాలు మంచి అనుభవాన్నిస్తాయి

● దర్శకుడు ఆర్.వి.ఉదయకుమార్



'పార్క్' ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రపరిశ్రమలోకి కొత్తగా అడుగుపెట్టినవారు పలు కష్టాలు ఎదుర్కొని వచ్చామని చెబుతుంటారని, వాస్తవానికి కష్టాలు మంచి అనుభవాన్నిస్తాయని, ఆ అనుభవమే జీవితానికి పునాది అని సీనియర్ దర్శకుడు, కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్ అన్నారు. అక్షయ మూవీ మేకర్స్ బ్యానరుపై లయన్ ఈ.నటరాజ్ నిర్మాణంలో ఈకే మురుగన్ దర్శకత్వంలో రూపొందిన హార్రర్ చిత్రం 'పార్క్'. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను సోమవారం రాత్రి నగరంలో విడుదల చేశారు. ఇందులో దర్శకులు ఆర్వీ ఉదయకుమార్, పేరరసు, శరవణ సుబ్బయ్య, సింగంపులి, నిర్మాత లయన్ నటరాజ్, దర్శకుడు ఈకే మురుగన్, నటి శ్వేతా డోరత్తి, హీరో తమన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ముందుగా దర్శకుడు ఆర్వి ఉదయకుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమాలో హీరోను చూస్తుంటే ఈర్ష్యగా ఉంది. నా కంటే వయస్సులో పెద్దవారైన వారికి హీరో వేషాలు, నాకు మాత్రం ముఖ్యమంత్రి, మంత్రి వంటి పాత్రలు ఇస్తున్నారు. అందుకే ఇపుడు హీరోగా నటించాలన్న ఆశకలిగింది.కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఒక సినిమా తీయెచ్చు. కానీ, ఆ సినిమాలో సరైన కథ, స్ర్కీన్‌ప్లే ఉండాలి' అని పేర్కొన్నారు. దర్శకుడు పేరరసు మాట్లాడుతూ, 'దర్శకుడికి మంచి కథ కావాలి...హీరోయిన్ బొద్దుగా ఉండాలి. బాషతో పనిలేకుండా తమిళ ప్రేక్షకులు హీరోయిన్లను ఆదరిస్తారు. ఉదాహరణకు అలనాటి నటి సరోజాదేవి. ఇపుడు కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన హీరోయిన్ శ్వేతకు స్వాగతం పలుకుతున్నాం' అన్నారు. హీరో తమన్ కుమార్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ద్వారా నిర్మాత దర్శకుడిగాను, దర్శకుడు నటుడిగా మారబోతున్నారు. దర్శకుడు మురుగన్‌లో మంచి కామెడీ సెన్స్ ఉంది. వారిద్దరికి శుభాకాంక్షలు. అలాగే, ఈ సినిమాలో నటించిన వారందరికీ ధన్యవాదాలు' అని పేర్కొన్నారు. దర్శకుడు మురుగన్ మాట్లాడుతూ, 'నిర్మాత ఈ అవకాశం ఇవ్వడం వల్ల నాకు మంచి జీవితం లభించింది. సాధారణంగా ఒక హార్రర్ చిత్రంలో దెయ్యాలను పారదోలేందుకు స్వామీజీలను పిలుస్తారు. ఇందులో ఒక సాధారణ వ్యక్తి ఈ దెయ్యాన్ని వెళ్ళగొట్టే విధంగా కాస్త వైవిధ్యంగా తెరకెక్కించాను. ఈ సినిమా విజయానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి' అని కోరారు.

'సిద్ధార్థ్-40' చిత్రంలో శరత్ కుమార్ - దేవయాని

చిత్రజ్యోతి

హీరో సిద్ధార్థ్ నటించే 40వ చిత్రం పూజా కార్యక్రమంతో మంగళవారం ప్రారంభమైంది. శాంతి టాకీస్ బ్యానరుపై అరుణ్ విశ్వ నిర్మించే ఈ చిత్రాన్ని శ్రీగణేష్ దర్శకుడు. ఇందులో సీనియర్ నటీనటులు శరత్ కుమార్, దేవయాని ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. వీరిద్దరూ కలిసి 1997లో 'సూర్యవంశం' వంటి సూపర్‌హిట్ చిత్రంలో నటించారు. దాదాపు 27 యేళ్ళ తర్వాత ఇపుడు వీరిద్దరు వెండితెరపై కనిపించనున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రంలో సిద్ధార్థ్ సరసన మీతా రఘునాథ్, చైత్రా ఆచార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా వెల్లడించనున్నారు.



మూడో బిడ్డకు 'పవన్'గా నామకరణం చేసిన ఎస్కే


భార్యాపిల్లలతో శివకార్తికేయన్

హీరో శివకార్తికేయన్ తన మూడో బిడ్డకు పవన్ అనే పేరు పెట్టారు. ఈ విషయాన్ని ఆయన తన ఇన్‌స్టా ఖాతాలో వెల్లడించారు. అలాగే, తన కుమారుడు నామకరణ వేడుకకు సంబంధించిన వీడియోను కూడా షేర్ చేశారు. 2010లో ఆర్తి అనే యువతిని హీరో శివకార్తికేయన్ వివాహం చేసుకున్న విషయం తెల్సిందే. వీరికి ఆరాధన అనే కుమార్తె, గుహన్ అనే కుమారుడు ఉన్నాడు. ఈ నేపథ్యంలో గత నెల రెండో తేదీన ఈ దంపతులకు మగబిడ్డ జన్మించాడు. ఈ బాలుడికి పవన్ అనే పేరు పెట్టారు. కాగా, శివకార్తికేయన్ ఒక వైపు హీరోగా, మరో వైపు నిర్మాతగా రాణిస్తున్న విషయం తెల్సిందే. ఈ యేడాది ఆరంభంలో 'అయలాన్', ఆ తర్వాత 'అమరన్' చిత్రాలు విడులైన విషయం తెల్సిందే. ప్రస్తుతం ఆయన ఏఆర్.మురుగదాస్ దర్శకత్వంలో ఎస్‌కే 23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న చిత్రంలో నటిస్తున్నారు.

నేడు 'తంగలాన్' నుంచి ఫస్ట్‌సింగిల్

పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ హీరోగా నటించిన 'తంగలాన్' మూవీ విడుదలకు సిద్ధమవుతుంది. ఇందులో భాగంగా ఈ చిత్ర ప్రచార కార్యక్రమాలను ఇపుడిపుడే ప్రారంభిస్తున్నారు. ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌ను బుధవారం విడుదల చేయనున్నట్టు నిర్మాణ సంస్థ స్టూడియో గ్రీన్ ప్రకటించింది. విక్రమ్, పార్వతి, మాళవిక మోహనన్ జంటగా నటించగా, పశుపతి తదితరులు నటించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం. నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా భారీ బడ్జెట్‌తో తమిళం, తెలుగు, హిందీ, కన్నడ, మలయాళం భాషల్లో తెరకెక్కించారు. కోలార్ బంగారు గనుల నేపథ్యంలో పీరియాడికల్ ఫిల్మ్‌గా తెరకెక్కించారు. ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేయగా, మంచి ఆదరణ లభించింది. సినిమాను ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



విక్రమ్, పార్వతి

మన్నార్ జలసంధిలో పెనుగాలులు

● చేపలవేటకు వెళ్ళని రామేశ్వరం జాలర్లు


రామేశ్వరం తీరంలో నిలిపిన పడవలు

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా మన్నార్ జలసంధి, పాక్ జలసంధి ప్రాంతాల్లో పెనుగాలులు వీస్తుండటంతో మంగళవారం ఉదయం రామేశ్వరం జాలర్లు చేపలవేటకు వెళ్లకుండా తీరానికే పరిమితమయ్యారు. సముద్రంలో చేపలవేటకు వెళ్ళకూడదంటూ మత్స్యశాఖ అధికారులు నిషేధం విధించడంతో జాలర్లు తమ పడవలను తీరంలోనే నిలిపి ఉంచారు. ధనుష్కోడి, పాంబన్, మండపం, కీళ్‌కరై, ఏర్వాడి, ముగైయూరు ప్రాంతాలకు చెందిన సుమారు 500 మంది జాలర్లకు చేపలవేటకు వెళ్లలేదని మత్స్యశాఖ ఉన్నతాధికారులు తెలిపారు. ఇదే విధంగా రామేశ్వరం, దేవీపట్టినం, సోలియకుడి, తొండి తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 1000 మంది జాలర్లు కూడా చేపలవేట మానుకుని ఇంటిపట్టునే గడుపుతున్నట్లు పేర్కొన్నారు.

హస్త కళాకారులకు పురస్కారాలు

● అందజేసిన సీఎం స్టాలిన్


సీఎం స్టాలిన్‌తో పురస్కారగ్రహీతలు

ప్యారీస్, జూలై 16: తమిళనాడు చేతివృత్తుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంపిక చేసిన ఉత్తమ కళాకారులకు ముఖ్యమంత్రి స్టాలిన్ మంగళవారం పురస్కారాలు అందించి సత్కరించారు. చేతివృత్తుల పరిశ్రమలో అంకిత భావంతో రాణిస్తున్న 65 ఏళ్లు పైబడిన 8 మంది సీనియర్ కళాకారులకు సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో సీఎం అవార్డులు, నగదు బహుమతి అందజేశారు. 2022-23వ సంవత్సరానికి సంబంధించిన అవార్డులకు ఎంపికైన కాంచీపురం జిల్లాకు చెందిన బాలకృష్ణన్, కేపీ ఉమాపతి, ఎస్.రాజగోపాల్, ఎన్.మణి ఆచారి, సి.ముత్తుస్వామి ఆచారి, ఎస్.గోవిందరాజ్, పి.సుదైఖాన్ బీవీ, ఎస్.తంగజ్యోతి సీఎం చేతుల మీదుగా పురస్కారంతో పాటు తలా రూ.లక్ష నగదు, 8 గ్రాముల బంగారు పతకం, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలోనే రాష్ట్ర పూంపుహార్ అవార్డులను కూడా మరో 10 మందికి అందజేశారు. వీరికి రూ.50 వేల చెక్, 4 గ్రాముల బంగారు పతకం, ప్రశంసాపత్రం అందించారు. కార్యక్రమంలో మంత్రి టీఎం అన్బరసన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వీఐటీ-యూఎస్ మధ్య అవగాహన ఒప్పందం


ఒప్పందపత్రాలతో వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్, యూఎస్ వర్సిటీ ప్రతినిధులు

వేలూరు, జూలై 16: వీఐటీ వేలూరు, యూఎస్‌లోని వాండర్‌బిల్ట్ విశ్వవిద్యాలయం, శాన్ ఆంటోనియాలోని టెక్సాస్ విశ్వవిద్యాలయం, డల్లాస్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయం, నార్త్ టెక్సాస్ విశ్వవిద్యాలయం సహా ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలతో విద్య, పరిశోధనలపై అవగాహన ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందం ద్వారా వీఐటీ విద్యార్థులు, ప్రొఫెసర్లు బోధన, పరిశోధన కోసం అమెరికా విశ్వవిద్యాలయాలకు వెళ్లనుండగా, ఆ వర్సిటీ నుంచి ప్రొఫెసర్లు వీఐటీ యూనివర్శిటీకి రానున్నారు. ఈ సందర్భంగా వీఐటీ ఛాన్సలర్ విశ్వనాథన్ మాట్లాడుతూ... వీఐటీ ప్రసిద్ధ అమెరిక విశ్వవిద్యాలయాలతో అనుబంధం కలిగి ఉండడం గర్వంగా ఉందన్నారు. అమెరికా వర్సిటీలు విద్య, పరిశోధనల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తాయని, ఈ ఒప్పందం రెండు వర్శిటీల విద్యార్థులు, ప్రొఫెసర్లకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఛాన్సలర్ విశ్వనాథన్ తెలిపారు.

స్టార్టప్‌ల కోసం క్రికెట్ లీగ్ పోటీలు



విజేత టీం

అడయార్, జూలై 16: నగర శివారు ప్రాంతమైన మహాబలిపురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఎఫ్‌సీ మద్రాస్ అకాడెమీలో స్టార్టప్ కంపెనీల కోసం క్రికెట్ లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. సాస్ బూమి క్రికెట్ లీక్ వీటిని నిర్వహించింది. క్యూఈడీ కార్పొరేట్ ఆధారిత అడ్వైజర్స్ ఎల్‌ఎల్‌పీ నగరంలోని ఆరు డైనమిక్ సాస్ స్టార్టప్‌లను ఉత్తేజపరిచేలా ఈ పోటీలను నిర్వహించారు. ఇందులో సూపర్‌రూప్స్, రాకెట్‌లేన్, ఫ్యాసిలో, అన్‌స్టాక్ట్, కులా, ఫ్లైట్‌పై జట్లు పాల్గొన్నాయి. కేవలం క్రికెట్ పోటీలే కాకుండా, విశేషమైన క్రికెట్ నైపుణ్యాలు, స్నేహ బంధం, సమాజ స్ఫూర్తిని పెంపొందించేలా ఈ ఈవెంట్ ఆర్గనైజ్ చేశారు. సాస్‌బూమి 5వ వార్షికోత్సవం, క్యూఈడీ కార్పొరేట్ అడ్వైజర్స్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలను నిర్వహించినట్టు సాస్‌బూమి సీఈవో అవినాస్ రాఘవ వెల్లడించారు.

నీలగిరి, కుమరి సహా 4 జిల్లాల్లో వర్షబీభత్సం


● రహదారులపై కూలిన చెట్లు
● పొంగి ప్రవహిస్తున్న జలాశయాలు


ఊటీ ఘాట్‌రోడ్డులో మట్టిపెళ్లలను తొలగిస్తున్న కార్మికులు


తిరపరుప్పు జలపాతం వద్ద పొంగి ప్రవహిస్తున్న జలాలు


వాల్పారై ఘాట్‌రోడ్డులో పడిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


రహదారిపై మట్టిపెళ్లలు పడటంతో ఆగిపోయిన బస్సులు


అమరావతి డ్యామ్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జలాలు

చెన్నై, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా నీలగిరి, కన్నియాకుమారి, తిరుప్పూరు, కోయంబత్తూరు జిల్లాల్లో భారీగా వర్షాలు కురవటంతో రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమై ప్రజాజీవనం సైతం స్తంభించిపోయింది. పెనుగాలులతో కురిసిన వర్షానికి పలుచోట్ల రహదారులపై మట్టి పెళ్లలు, బండరాళ్లు, చెట్లు కూలిపడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు కూడా తీవ్ర అంతరాయం ఏర్పడింది. నీలగిరి జిల్లాలో గత మూడు రోజులుగా కుండపోతగా వర్షాలు కురిశాయి. దీంతో పల్లపు ప్రాంతాలు దీవులుగా మారాయి. ఘాట్‌రోడ్డులో చెట్లు కూలిపడ్డాయి. మట్టి పెళ్లలు విరిగిపడి పలుచోట్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. జిల్లా అంతటా మంగళవారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. అవలాంజిలో అధికంగా 372 మి.మీ. వర్షపాతం నమోదైంది. పడమటి కనుమల్లో గాలి వేగం అధికమవటంతో, బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటంతో నీలగిరి జిల్లాలోని ఊటీ తదితర ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షాలు కురుస్తున్నాయి. అధికారులు రోడ్లలో కూలిన చెట్లను, జారిపడ్డ మట్టిపెళ్లలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారు. జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఊటీలోనూ భారీగా వర్షం కురిసింది. దీంతో పర్యాటకులు లాడ్జీల నుండి బయటకు వెళ్లలేక పోయారు. ఊటీలో ప్రభుత్వ బోటానికల్ గార్డెన్, రోస్ గార్డెన్ తదితర ప్రాంతాలు పర్యాటకులు లేక బోసిపోయాయి. కొంత మంది పర్యాటకులు వర్షాన్ని లెక్క చేయకుండా గొడుగులువేసుకుని ఉద్యానవనాల్లో సంచరించారు. వర్షం కారణంగా బోట్ హౌస్ వద్ద పడవ సవారీ రద్దు చేశారు. సోమవారం రాత్రంతా కురిసిన వర్షానికి ఊటీలోని పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఊటీ, నడువట్టమ్, ఎమరాల్డ్, గూడలూరు, కిలాన్‌మార్గన్, సెంగోడు, కొత్తగిరి, కొడనాడు కీళ్‌కోత్తగిరి తదితర ప్రాంతాల్లో చెదురుముదురుగా వర్షాలు కురవటంతో ఆ ప్రాంతాల్లోని ప్రజలందరూ ఇళ్ళకే పరిమితమయ్యారు.

అమరావతిలో పెరిగిన నీటిమట్టం...

తిరుప్పూరు జిల్లా ఉడుమలై సమీపం పడమటి కనుమలకు చేరువగా ఉన్న అమరావతి డ్యాంలో నీటి మట్టం విపరీతంగా పెరిగింది. గత మూడు రోజులుగా ఆ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు డ్యాంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. సోమవారం ఆ డ్యాంలో సోమవారం ఉదయం నీటి మట్టం ఒకేసారి ఎనిమిది అడుగులకు పెరిగింది. ఆ డ్యామ్‌లో 90 అడుగుల మేర నీటిని నిల్వచేసేందుకు వీలుండగా, ప్రస్తుతం ఆ డ్యాం నీటి మట్టం 72.34 అడుగులకు పెరిగింది. తిరుప్పూరు పరిసర ప్రాంతాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తుండటంతో అమరావతి డ్యాం నీటి మట్టం క్రమంగా పెరుగుతోందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఈ డ్యాం ఆయకట్టు కింద సాగు చేసే రైతులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో నారు మళ్ల వేయడానికి కూడా సిద్ధమవుతున్నారు.


ఊటీని కమ్మేసిన కారుమబ్బులు

పొల్లాచ్చి - వాల్పారైలో...

కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి, వాల్పారై ప్రాంతాల్లో గత మూడు రోజులుగా కుండపోతగా వర్షాలు కురిశాయి. దీంతో పలు చోట్ల రహదారుల్లో వృక్షాలు కూలిపడ్డాయి. రహదారులు, పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రారంభమైన వర్షం మంగళవారం వేకువజాము వరకూ కురిసింది. దీంతో వాల్పారై - పొల్లాచ్చి ఘాట్‌రోడ్డులోని 23, 24, మలుపుల వద్ద చెట్లు, మట్టిపెళ్లలు, బండరాళ్ల కూలిపడ్డాయి. ఈ కారణంగా బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక దళం ఘాట్‌రోడ్డులో పడిన బండరాళ్ల, మట్టిపెళ్లలు, చెట్లను తొలగించారు. ఉదయం 8.30 గంటలకు చెట్లు, మట్టిపెళ్లలు, బండరాళ్ల తొలగించడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

కన్నియాకుమారిలో... : బంగాళాఖాతంలో కేంద్రీకతమైన అల్పపీడనం కారణంగా కన్నియాకుమారి జిల్లా అంతటా చెదురుముదురుగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం సముద్ర తీర ప్రాంతాల్లో పెనుగాలులు వీచాయి. సముద్రంలో అలల ఉధృతి, గంటకు 55 కి.మీ.ల వేగంగా పెనుగాలులు వీస్తుండటంతో జాలర్లు చేపలవేటకు వెళ్లకుండా తీరానికే పరిమితమయ్యారు. అదే సమయంలో కుండపోతగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలోని జలాశయాల్లో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. పేచ్చిపారై నుంచి జలాలను విడుదల చేయడంతో ఆ జలాలన్నీ తిరపరుప్పు జలపాతంలోకి ప్రవేశించడంతో ఆ జలాశయం వద్ద వరద పరిస్థితులు నెలకొన్నాయి. దీనితో ఆ జలపాతం వద్ద పర్యాటకులెవరూ స్నానానికి వెళ్ళకుండా అధికారులు కట్టుదిట్టం చేశారు.


అన్నదాన కార్యక్రమం

ఆలూరి రామస్వామికి ఘననివాళి

ప్యారీస్, జూలై 16: తెలుగు ప్రముఖుడు ఆలూరి రామస్వామి 16వ వర్ధంతి సందర్భంగా మంగళవారం ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. కోడంబాక్కం అజీజ్ నగర్‌లో ఉన్న అన్నై ఇల్లం వృద్ధాశ్రమంలో రామస్వామి కుమార్తె, సౌత్ సిటీ లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా.ఏవీ శివకుమారి అధ్యక్షతన వృద్ధులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించారు. ముఖ్యఅతిథిగా నగర పోలీసు జాయింట్ కమిషనర్ ఎ.కయల్‌విళి పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు ఫరీదా షేక్, కలామతి, రాధారాణి, గీతా కన్నన్, రుక్మిణి, విజి, రాజేంద్రన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చెన్నై సచివాలయంలో ఉన్నతవిద్యాశాఖ ఆధ్వర్యంలో పుదుకోట, తిరుచ్చి, కోయంబత్తూరు జిల్లాల్లో ఆర్ట్స్, సైన్స్, సాంకేతిక కళాశాలల్లో రూ.52.75లక్షలతో నిర్మించిన కొత్త భవనాలను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్. చిత్రంలో మంత్రి కె.పొన్ముడి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి వీరరాఘురావు తదితరులు న్నారు.



గోపాలపురంలో బాక్సింగ్ శిక్షణ కేంద్రం

పరిశీలించిన మంత్రి ఉదయనిధి

అడయార్, జూలై 16: స్థానిక గోపాలపురంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన బాక్సింగ్ శిక్షణా కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పనులను రాష్ట్ర మంత్రి ఉదయనిధి పరిశీలించారు. ఈ స్టేడియంను రూ.7.79 కోట్లతో నిర్మిస్తున్నారు. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వివిధ రకాల క్రీడా శిక్షణా కేంద్రాలను నిర్మిస్తున్నారు ఇందులో భాగంగా, గోపాలపురంలో శిక్షణా కేంద్రం నిర్మాణ పనుల పురోగతిని మంత్రి ఉదయనిధి పరిశీలించారు. ఆయన వెంట ప్రభుత్వ అదనపు ముఖ్య కార్యదర్శి అతుల్య మిశ్రా, క్రీడా మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఉన్నారు.

